ఉద్యోగం

ఎదురుగావున్న గోడగడియారంకేసి చూసింది మాలతి.

అప్పుడు సరిగ్గా ఐదునిమిషాలు తక్కువ పది అయింది.

హాయిగా ఊపిరి పీల్చుకుని, సీట్లో వెనక్కు వాలింది. లైబ్రరీ వారికి తిరిగి ఇవ్వాలని తెచ్చిన వీక్లీని చేతిలోకి తీసుకొని మళ్లీ ఓసారి తిరగేయసాగింది.

గడియారం పదికొట్టింది.

బజర్ వినిపించింది.

వీక్లీని పక్కన పడేసి లేచింది మాలతి. షార్ట్‌హ్యాండ్ నోట్‌బుక్ పెన్సిల్ తీసుకొని మేనేజర్ రూంలోకి నడిచింది.

"గుడ్‌మార్నింగ్" చెప్పింది.

అవతలివేపు నుంచీ చిన్న తల వూపు. దాని అర్థం ఆమెకు తెలుసు.

బసవరాజు చాలా "సీరియస్"గా ఉన్నట్టు!

ఇలాంటి సందర్భాల్లో పదిగంటలకల్లా సీట్లో లేకపోయినప్పుడు సంభవించిన పరిణామాలు ఆమెకు గుర్తుకొచ్చినై.

అవన్నీ... ఉరుములు, మెరుపులు, ఫిరంగి మోతలు! క్రమశిక్షణమీదా, "పంక్చుయాలిటీ"మీద, ఉద్యోగ ధర్మంమీదా... "ప్రి రికార్డెడ్ కాసెట్"లోని ఉపన్యాసాలు అవి!

ఇవాళ వాటిని వినే అవస్థ తప్పింది. ఇవాళ వాటిని భరించే బాధ తప్పింది. ఇవాళ వాటిని గురించి సాయంత్రందాకా ఆలోచించే అవసరం తప్పింది.

ఇవాళ తను సరియైన టైమ్‌కు ఆఫీసుకు చేరుకుంది.

మేనేజర్‌కేసి నెమ్మదిగా తలెత్తి చూసింది మాలతి.

సిగరెట్ పొగని గట్టిగా వదుల్తూ కిటికీలోనుంచీ ఆకాశంకేసి చూస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు బసవరాజు.

బట్టతలమీద ఎడారిలో గడ్డిపోచల్లా మిగిలిన ఒకటి రెండు వెంట్రుకలు... గాలికి కదులుతున్నై. ముఖంలో గాంభీర్యం, కళ్లల్లో తీవ్రతరమైన ఆలోచనా తరంగాలు.

కుడివైపు - కంటిఅద్దాల కిందుగా బయల్దేరి రెండు పెదవులూ కలిసిన చోటువరకూ వ్యాపించిన సన్నని కత్తిగాటు తాలూకు మచ్చ!

ఎప్పుడో... మంచి మూడ్‌లో వుండగా చెప్పాడు. చిన్నప్పుడు చాలా దుడుకు స్వభావమంట తనది. చెట్టుమీదకెక్కిన మిత్రుడు.. కింద నిలబడి చేతులు సాచి మెడలు రిక్కిరించుకుని చూస్తున్న తనకు - ఎంతసేపటికీ జామకాయని పడేయకపోగా వాడు తిని ఆనందిన్తూ కూర్చుంటే... కొట్లాటకు దిగి వాడితోతలపడ్డాట! దాని చిహ్నం అది!

ఆ సంఘటనని వర్ణించి చిత్రంగా నవ్వేడు, బసవరాజు. బాల్య స్మృతులు తలపుకువచ్చి ఏమేమో చెప్పుకుపోయాడు, అప్పట్లో తన మొండి తనం గురించి.

"కనబడుతూనే వున్నై లక్షణాలు... ఇప్పుడూనూ!" అనుకుని లోలోపల నవ్వుకుంది... తానా వేళ!

"యూ టేక్ దిస్..." అనే పిలుపుతో ఈ లోకంలో పడింది మాలతి. పుస్తకంమీదకి ఆనింది పెన్సిల్

సిగరెట్ మసిని "యాష్ ట్రేలో విదిలిస్తూ తన డిక్టేషన్ సాగించేడు బసవరాజు.

లెటర్ అయిపోయింది. మాలతి లేచి తన గది లోకి వచ్చింది.

టైప్ రైటర్‌లో కాగితాలు అమర్చింది. ఆమె వ్రేళ్లు నాట్యంచేయసాగినై. క్షణాల్లో లెటర్ తయారైపోయింది.

చదివి చూసుకుంది. తనను ఈ సంవత్సరం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ

ఊరినుంచి బదిలీచేయవద్దని డైరెక్టర్‌కి చాలా ఘట్టిగా రాసుకున్న విన్నపం అది!

సన్నగా నవ్వుకుంది మాలతి. లెటర్ తీసుకుని ఛాంబర్‌లోకి వెళ్లింది.

ఫోన్లో మాట్లాడుతున్నాడు బసవరాజు...

కూర్చుంది.

విషయం అర్థమౌతూనే వుంది. ఉత్తరంలోని విషయాల్నే డైరెక్టర్‌గారికి మనవి చేసుకుంటున్నాడు.!

బసవరాజు ముఖకవళికల్ని చూసీ చూడనట్లు గమనిస్తూ, లెటర్‌కేసి చూపులు మార్చిమార్చి చూస్తూ, గదిలోని వాతావరణంలో ఇరుగ్గా కూర్చుంది... మాలతి.

క్షణాల తర్వాత...

ఆవతలవైపు నుంచీ ఏదో అడగబడినట్లూ, దానికి సమాధానంగా బసవరాజు చాలా చాలా వినయంగా, ఆనందంగా, హాయిగా నవ్వేస్తూ... "యస్. యస్ సర్ అదేమంత కష్టంకాదులెండి. అలాగే తప్పకుండా. ష్యూర్. తప్పకుండా చేస్తాను. ఉంటాను సార్'' అంటూ తన అంగీకారాన్ని పుష్కలంగా వెదజల్లుతున్నట్లూ... అర్థమైంది మాలతికి.

బసవరాజు ఫోన్ పెట్టేశాడు. సిగరెట్ వెలిగించుకుని 'లెటర్' చూశాడు.

పైనుంచీ క్రింది దాకా అతి శ్రద్ధగా జాగ్రత్తగా చదవసాగేడు.

ప్రాణాలు ఉగ్గబట్టుకుని కూర్చుంది మాలతి. ఉత్తరం సంతకమైంది. "యూ సెండ్ దిస్ అవే" అంటూ ఆమెకేసి తోశాడు.

'హమ్మయ్య' అనుకున్నట్లు ఊపిరి పీల్చుకుని అతి త్వరగా లేచి బయటికి వచ్చేసింది మాలతి.

'మొదటి ప్రమాదం నుంచీ రక్షింపబడ్డాను'. అని తనలోతానే అనుకొనే సరికి సన్నగా నవ్వొచ్చింది.

ఉత్తరాల్ని భూతద్దంలోంచీ చూస్తాడు బసవరాజు. కామాలూ, సెమీకోలన్‌లూ సరిగా రాకపోయినా సరే. ఇక ఆ రోజంతా... క్షణక్షణమూ... చిరాకూ, విసుగూ, చీదరింపూ... వీటన్నిటితోపాటు ఛాంబర్‌లోకి వెళ్ళినప్పుడల్లా కరకరలాడే హెచ్చరికలూ.. దుముకుతూ ఉంటై ఆయన నోట్లోంచి.

"కుడి ఎడమల దాల్‌కత్తులూ, నోట్లోంచీ ఎప్పుడూ లెక్చర్లూ... ఆయన దగ్గర పని చేయడం కంటే, సెంటర్లో పచ్చి మిర్చి బజ్జీలు అమ్ముకోవడం మంచిది" అంటూ వుంటాడు చంద్రబాబు.

అతను నలభై రోజులు ఆ సీట్లో పనిచేశాడు. ఆ అనుభవం తాలూకు వ్యాఖ్యానం అది!

తానువచ్చి రెండేళ్లయింది.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఆయన డిక్టేషన్ 'పర్‌ఫెక్ట్'గా ఉంటుంది. మనిషి కొంచెం"ఫెస్టీడియస్"! అంతే స్టెనోగా తన అభిప్రాయం ఇది!

ఉత్తరాన్ని పంపి, ఫైలు తిరగేయసాగింది మాలతి.

దేశంలోని చాలా పెద్ద కంపెనీల్లో ఒకటైన తమ కంపెనీకి- ఇక్కడి ప్రాంతీయ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న చాలా మంది ఆఫీసర్లకు సంబంధించిన రహస్య భోగట్టా కలిగిన ఫైలు అది! వారంతా బసవరాజు ఆధీనంలోని పావులు.

బసవరాజు బదిలీకి సంబంధించిన ఈ ఆర్థింపు కాపీనీ... ఆ ఫైల్‌లోనే వేసింది మాలతి.

వెనకటి కాగితాలు తిరగేస్తుంటే, బసవరాజు వ్యక్తిగత జీవితం గుర్తుకొచ్చింది మాలతికి.

తన పదహారో ఏట ఈ కంపెనీలో 'బాయ్, గా చేరేట్ట బసవరాజు. ముప్ఫై ఎనిమిదేళ్ల సర్వీసు. 'బాయ్' నుంచి జనరల్ మేనేజర్ వరకూ ఎదగడం! ఎంత సుదీర్ఘమైన యాత్ర అది! పరమపద సోపాన పటంలో కేవలం నిచ్చెనలే ఎక్కుతూ వచ్చేదన్నమాట! అవును ఎక్కడ, ఏపాము నోట్లో పడివున్నా; ఇప్పుడీ అంతస్తుకి

రాగలిగేవాడు కాదు. ఇదంతా... తనశక్తి యుక్తులూ, సామర్థ్యం, నేర్పు, చాకచక్యాల వల్లనే సాధ్యమైందనే గర్వం వుంది బసవరాజుకు, ఆయన అహంలో అర్థం వుందనే అనిపించింది, మాలతికి.

బజ్జర్ మ్రోగింది.

మాలతి లోపలికి వెళ్ళింది.

ఆఫీస్ సర్క్యులర్ ఒకటి చెప్పాడు బసవరాజు. దాన్ని పూర్తిచేసి లోపలికి వెళ్లేసరికి మళ్లీ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు బసవరాజు

ఆ 'కాల్' ఎక్కడినుంచో... క్షణాల్లోనే తెలిసిపోయింది మాలతికి.

బసవరాజుకి ఆంజనేయుడులాంటి ఒక మేనేజర్ వున్నాడు. అతనా కంపెనీ అమ్మకాల వ్యవహారాలు చూస్తూ వుంటాడు. అతని పేరు హనుమంతరావు. అతన్తోనే ఇప్పుడు బసవరాజు మాట్లాడుతున్నాడు.

"అవును. డైరెక్టర్ గారికి చెప్పాను. మీరు పంపుతారనే 'ప్రామిస్' చేశాను. ఆఁ... అవునవును, మీ పేరు చెప్పకుండా వుంటానా... షూర్... అలాగే... ఆఁ ... అలా చేసేయండి. ఇవ్వాళే ఆరెంజ్ చేసెయ్యండి. ఓకే".

బసవరాజు ఫోన్ పెట్టేసి, మాలతికేసి చూశాడు. సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు. ప్యూన్‌ని పిలిచి కాఫీకి ఆర్డరిచ్చాడు. అప్పుడు కాగితాన్ని చూడసాగేడు.

మళ్లీ ఉగ్గబట్టి కూర్చుంది, మాలతి.

సంతకం అయింది. ఊపిరి పీల్చుకుంది మాలతి. కాగితాన్ని తీసుకుని ఇవతలికి రాబోయింది.

"మిస్ మాలతీ"... పిల్చేడు.

వెనక్కి తిరిగి నిలబడింది మాలతి.

"డైరెక్టర్ లెటర్‌ని పంపావు కదూ?" అని అడిగేడు.

"యస్ సర్"

"ఓకే" అన్నాడు.

ఆమె తన గదిలోకి వచ్చేసింది.

బసవరాజు రాసిన ఉత్తరంలోని అంశాలు గుర్తుకొచ్చినై మాలతికి.

తనను ఆ ప్రాంతీయ కార్యాలయానికి మార్చిన తర్వాత, ఇక్కడ తను సాధించిన విజయాలూ, వ్యాపారాభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలు, ఉద్యోగుల్లో, సిబ్బందిలో నెలకొల్పిన క్రమశిక్షణ, మొదలైన అంశాలన్నిటినీ ముందుగా రాశాడు. ఆ తర్వాత, బదిలీచేస్తే తనకు కలిగే అసౌకర్యాల్ని గురించి రాశాడు. వాటిలో ప్రధానమైన అంశం... తన పెద్దకూతురు పెళ్ళి విషయం. ఈ ప్రాంతాల్లో తప్ప తమ కులానికి చెందిన వరులు లభ్యంకారనీ, తమ శాఖవారు అతి అల్పసంఖ్యాకులనీ...కనుక, ఆమెపెళ్లి పూర్తిచేసే వరకూ తనని ఇక్కడినుంచీ కదలించవద్దనీ అభ్యర్థిస్తూ పూర్తిచేశాడు.

ఏదో గజిబిజి దృశ్యాలు మాలతి మనసును చీకాకు పాలు చేశాయి. తన సంగతి, తన కుటుంబం సంగతి కళ్లముందు మెదిలాయి. తమ పరిస్థితిని యథాతదంగా చిత్రిస్తే 'అంతులేని కథ' కు భిన్నమైన చిత్రం తయారు కాదు. ఇంట్లో ఏ మూల చూసినా చదువుకుంటున్న తమ్ముళ్లు, పెళ్లి కాని చెల్లెళ్లు!

అదృష్టమో, దురదృష్టమో తానింకా ఎవ్వరి "ప్రేమ"లోనూ పడలేదు. అంతే!

ఉన్నట్టుండి చంద్రబాబు చెప్పిన ఒక్క విషయం గుర్తుకొచ్చింది మాలతికి. బసవరాజుకి ఇద్దరు పెళ్ళాలట. ఎవరికూతురో ఈ పెద్ద పిల్ల? సన్నగా నవ్వొచ్చింది మాలతికి. ఏమిటో ఈ సమాజం? అర్థంకాని చిక్కు ముడి - అనిపించింది.

సర్క్యులర్ని 'డిస్పాచ్' చేసి ప్యూన్ని పిలిచింది మాలతి. వీక్లీని లైబ్రరీ వారికి తిరిగి ఇచ్చేయమని అతని చేతికిచ్చింది.

అతను వెళ్లిపోయాడు.

లంచ్ టైం అయింది. కుర్చీలోంచి లేచింది మాలతి. టిఫిన్ కాఫీ ముగించి

తన రూంకు వచ్చేసరికి చంద్రబాబు, శ్రీనాథయ్యా అక్కడ కూర్చుని వున్నారు.

చంద్రబాబు అన్నాడు. "వీరు తెలుసు గదా శ్రీనాథయ్యగారు. జి.యమ్‌తో మాట్లాడటానికి వచ్చారు"

మాలతికి శ్రీనాథయ్య తెలుసు. తను ఆ సీట్లోకి వచ్చిన తరువాత కనీసం పది సార్లయినా వచ్చి ఉంటాడు. ఆయనకి ట్రాన్స్‌ఫర్ కావాలి. ఆ కారణాన్నే చంద్రబాబు ఆయనతో వచ్చాడు.

మాలతికి విషయం ఇట్టే అర్థమైపోయింది. మేనేజర్ రూమ్‌లోకి వెళ్లి శ్రీనాథయ్య వచ్చినట్లు చెప్పింది.

ఆయన ఫైల్స్ చూస్తూ "ఊ" అని ముభావంగా వూరుకున్నాడు. దాని అర్థం ఆమెకు తెలుసు. కూర్చోనిమ్మని ఆయన భావం.

వెనక్కి వచ్చింది. శ్రీనాథయ్యతో చెప్పింది. చంద్రబాబు వెళ్లిపోయాడు.

శ్రీనాథయ్య మాట కలిపేడు. "నా సమస్య నీకు తెలుసుగా మాలతీ, ఈ ఏడన్నా నాకు మోక్షం వస్తుందోలేదో..."

వయస్సులో మాలతికంటే ఎంతో పెద్దవాడు శ్రీనాథయ్య. అందుకనే ఆయన ఆమెని చనువుగా ఏకవచనంలో సంబోధిస్తాడు.

మాలతికి ఆయన సమస్యలు బాగా తెలుసు. ఆయన ఉండే వూరికి మూడువందల కిలోమీటర్ల దూరంలో ఉద్యోగం చేస్తూ ఉంటుంది ఆయన భార్య. వాళ్లకు ఐదుగురు పిల్లలు. బీటెక్ నుంచీ పదోతరగతి దాకా వారంతా తలా ఒక చోటా చదువులు సాగిస్తున్నారు. పెద్దపిల్ల పెళ్లీడుకొచ్చింది. తల్లి దగ్గర ఉంటుంది. ఆయనకో ముసలి తల్లి ఉంది. ఆమెకు టీబీ జబ్బు. అయినా పల్లె వదిలిరాదు. ఆ పల్లె ఆయన ఊరికి సుమారు రెండు వందల కిలోమీటర్లు. ఆర్థికంగా అంతంత మాత్రం సంసారం.

రెండేళ్లనుంచీ ఆయన బదిలీకోసం బాధపడుతున్నాడు. తానూ భార్య పనిచేసే ప్రదేశానికి వెళ్తే అక్కడికే తల్లిని తీసుకొచ్చి వైద్యం చేయించవచ్చుననీ,

కూతురికి పెళ్లి సంబంధాలు చూసుకోవచ్చుననీ ఆయన ఆశ. ఇన్ని చోట్ల వేరువేరు కుంపట్లని సాగించడం తప్పిపోతే బాగుండునని ఆయన కోరిక.

కాని, అక్కడ ఖాళీ ఉన్నా శ్రీనాథయ్యకు బదిలీ రావడం లేదు. దీనికి యాజమాన్యం చెప్పే కారణాలు కోకొల్లలు. వాటిలో ముఖ్యమైనది... ఆయనకంటే ఉత్సాహవంతుడై, ఏ బాదర బందీ లేని యువకుణ్ణి ఆ ప్రాంతంలో వేస్తే అక్కడ తమ వ్యాపారం బాగా అభివృద్ధి కావడానికి అవకాశం ఉంటుందని! ఈ రెండేళ్లనుంచీ ఈ ఆలోచన ఆలోచనగానే ఉంది!

"ఇదంతా కాగితాల మీద కథ! అసలు వ్యవహారం వేరు. శ్రీనాథయ్యకి లౌక్యం, లౌకికం తెలీవు.!" ఇది చాలా మంది చెప్పుకుని నవ్వుకొనే వాస్తవం. అందుకనే ఆయనకి పన్నెండేళ్లనుంచీ ప్రమోషనూ లేదట.

ఇదంతా మాలతికి తెలుసు. ఆయన పరిస్థితి తలుచుకుంటే ఆమెకు జాలి కలుగుతుంది.

ఈ నిబంధనలూ అవీ ఇలా కొందరికి మాత్రమే ఎందుకు ఏర్పాటవుతాయో, ఏమిటో అని అప్పుడప్పుడూ ఆలోచిస్తూ ఉంటుంది మాలతి. అయితే, ఆమెకు అవన్నీ పూర్తిగా అర్థంకావు. ఆలోచన సాగుతూ ఉండగానే బజ్జర్ మ్రోగుతుంది.

అవును ఇప్పుడూ బజ్జర్ మ్రోగింది.

మాలతి లేచి లోపలికి వెళ్లింది. అంతలోనే బయటికి వచ్చి చెప్పింది. "మీరు వెళ్లండి"

శ్రీనాథయ్య అంతఃపుర ప్రవేశం చేశాడు.

"కాదు అది ఓ పెద్ద గ్యాస్ ఛాంబర్" అంటాడు చంద్రబాబు.

సన్నగా నవ్వుకుంది మాలతి.

క్షణాల తరువాత మేనేజర్ రూములోనుంచి తారాస్థాయిలో మాటలు వినిపించసాగినై.

"నావల్లకాదండీ, చెపుతున్నానుకదా. మీ బదిలీ సాధ్యపడేదికాదు. నేను సిఫారసు చేయలేను"

... ఏదో నసుగుడు.

"మీ వ్యాపారం కూడా ఏమీ బాగాలేదు. ఇవ్వాళే డైరెక్టర్ ఫోన్ చేసి మీ గురించి నన్ను నానా మాటలూ అన్నారు."

....శ్రీనాథయ్య మళ్లీ ఏదో గొణిగి ఉంటాడనుకుంది మాలతి.

"ఐతే ఏంచెయ్యమంటారండీ, ఆమెను రిజైన్ చెయ్యమనండి. లేదా మీరు చేయండి. నాకేమీ అభ్యంతరం లేదు".

... ఇవతల ఏదో... సొన....మళ్లీ...

"అవును, నేనుగా పైవాళ్లకి చెప్పను, చెప్పను. అయినా, మీమీద నాకేవీం సానుభూతి లేదు. కారణం – మీ పర్ఫామెన్స్. ఉన్నవిషయం చెబుతున్నాను కదా!"

"కర్కోటకుడు!" మాలతి మనస్సు గొణుక్కుంది.

"ఇవన్నీ అందరికీ ఉన్న సమస్యలేనండీ! మీ తలనొప్పిని నాకు బదిలీ చెయ్యకండి. వెళ్లండి. అసలు నన్నడిగితే... ఈ దేశంలో ఆడవాళ్లకు ఉద్యోగాలిచ్చినంత బుద్ధితక్కువపని ఇంకోటి లేదు. ఉద్యోగం వచ్చేవరకూ నాలాంటి వాళ్లని నానా తిప్పలూ పెడతారు. ఆతరువాత మెటర్నిటీ లీవ్‌లు, ఇతర సెలవులూ, ట్రాన్స్‌ఫర్‌ల కోసం ఘోష... ఇంతేగా! పెద్ద న్యూసెన్స్"

బసవరాజు చిరాకు సరాసరి మాలతి గుండెల్లో తగిలింది. నివ్వెరపోయింది.

"చెప్పానుగా మిమ్మల్ని ఈఏడు బదిలీ చేసే అవకాశంలేదు."

శ్రీనాథయ్య బయటికి వచ్చాడు నీరసంగా, బాధగా, ఉక్రోషంగా, కోపంగా! లోలోపలి వ్యధ తాలూకు చిహ్నాలు ముఖంమీద తాండవిస్తున్నాయి.

"వస్తానమ్మా మాలతీ!" అంటూ నిమ్మళంగా వెళ్లిపోయాడు.

"ఏంవిటో ఈ ద్వంద్వ నీతి!" అనుకుంది మాలతి.

ఉన్మాదంలాటి ఆవేశం ఆమె బుద్ధిని తాడితం చేయ్యాలని చూసింది. కాని, నిగ్రహించుకుంది.

బజ్జర్ మ్రోగింది.

లేచి లోపలికి వెళ్లింది.

"ఉత్త యూజ్‌లెస్ ఫెలో" తనలో తాను అనుకుంటున్నట్లు పైకే అనేసి, వేరే లెటర్ చెప్పడం ప్రారంభించాడు బసవరాజు.

తిరిగి వచ్చి తన సీట్లో కూర్చుంది.

ఆమె మేధస్సులో చాలా ఆలోచనలు గిర గిర తిరగసాగినై.మనస్సు ఎందుకో అస్థిమితంగా తయారైంది. విసుగ్గా, చకచకా లెటర్‌ని టైప్ చేయసాగింది.

***

రెణ్ణెళ్లు గడిచాయి....

ఆ ఆఫీసులో, బసవరాజు బదిలీ కాలేదు.

హనుమంతరావుకి ప్రమోషన్ వచ్చింది.

శ్రీనాథయ్య గొంగళి అక్కడ్నుంచీ కొంచెం కూడా కదల్లేదు.

డైరెక్టర్‌గారికి హనుమంతరావు ద్వారా బసవరాజు అరేంజ్ చేసిన వస్తువులు మాలతి కళ్లముందు కదలాడినై.! వాటిని వర్ణించకూడదు.!!!

***

రాత్రి....

అమ్మా నాన్నా తన పెళ్లి గురించి మాట్లాడుకుంటుంటే హఠాత్తుగా ఉలిక్కి పడింది మాలతి.

బసవరాజు రూపం కళ్లముందు మెదిలింది. కుడివైపు కంటి అద్దాలక్రిందుగా

బయలుదేరి రెండు పెదవులూ కలిసినచోటువరకూ వ్యాపించిన సన్నని కత్తిగాటు తాలూకు మచ్చ!

ఆయన మాటలు చెవుల్లో మారుమ్రోగినై.

"అలాగైతే ఆమెను రిజైన్ చెయ్యమనండి లేదా మీరే చెయ్యండి. ఈ దేశంలో ఆడవాళ్ళకి ఉద్యోగాలిచ్చినంత బుద్ధితక్కువ పని ఇంకొకటి లేదు"

చెంపమీద చెళ్లున చరిచినట్లయింది మాలతికి. తనకు చూస్తున్న పెళ్లికొడుకు బొంబాయిలో ఉద్యోగం చేస్తున్నాడు.

కొండలాంటి జీవితం ఎదురుగా నిలబడింది.

జీవితాంతం కొండకు ఈవలి వైపునే నిలబడి పోవాలేమో తను?

ఎవరో కళ్లకు గుడ్డకట్టినట్లనిపిస్తోంది. ఇక ఎల్లకాలం చేతులతో వెదుకుతూ తిరుగుతూ ఉండాలేమో! ఎక్కడ? – చీకట్లో, శూన్యంలో!

మాలతి బెదిరింది. ఆమె కళ్లల్లో 'పెళ్లి పందిరి' మసక మసగ్గా కనిపించసాగింది. ఆలోచన.... ఉద్యోగాల్లోని ద్వంద్వ నీతిలో చిక్కుకుంది. ద్వైదీభావంతో ప్రతిమలా కూర్చుండిపోయింది.

కథకి వెంటనే ఎలాంటి ముగింపూ తోచడంలేదు.!!! జీవితానికి ముగింపు ఏంవిటి? కథ జీవితం కాదూ, మరి?!

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక 6 అక్టోబర్ 1983.)